# 49. అశీర్షకమ్

"**మీరు** ఉగాది పండక్కి ఇంటికి వెళ్లక్కర్లేదా ?"

రిఫ్రెషర్ కోర్సు ఆఫీసర్ కార్నీలియస్‌గారు కూడా ఎక్కణ్ణించో వచ్చి ఇక్కడ ఒంటరిగానే ఉంటున్నాడని తెలుసు గాని, ఆయన ఈ మెస్‌లో భోంచేస్తారన్నది నేను ఊహించలేని విషయం.

"గుడీవినింగ్, సార్ !" అన్నాను.

"సారీ, మిమ్మల్ని గాభరా పెట్టి నట్టున్నాను." అంటూ ఆయన ఒక స్టూల్ లాక్కుని నా కెదురుగా కూర్చున్నాడు.

"మై గుడ్‌నెస్ ! మీరు కూడా ఇక్కడే భోం చేస్తుంటారా? "

"వై - నాట్? నేను కూడా మీ లాంటి ఉద్యోగస్తుణ్ణే కదా ! ఎటొచ్చీ, ఎవరో అన్నట్టు - మీరు చిన్న కూలీ; నేను పెద్ద కూలీ!"

నేను అటూ ఇటూ దొంగతనంగా చూసి - "ఇక్కడి భోజనం - ఘోరంగా - ఉంటుందని ప్రతీతి. మీరు కూడా ఇక్కడే భోంచేస్తున్నారంటే ఏదో కొంచెం ఊరటగా వుంది." అన్నాను.

అందువల్ల రుచి ఏం పెరగ లేదుగాని, నా భోజనం స్పీడు పెరిగింది.

"అరె ! ఎందుకా కంగారు ? నిదానంగా తినండి. నాకేం పన్లేదు; కూర్చుంటాను! ! మీ భోజనం అయ్యాకా కబుర్లు చెప్పుకుంటూ వెళదాం."

రిఫ్రెషర్ కోర్సుకి గుంటూరొచ్చిన వాళ్లం ఇరవై ఆరు మందిమి. ఇందులో పదహారు మంది ఉగాది, రమ్‌జాన్, ఆదివారం సెలవులు ఆధారంగా మధ్యలో ఉండిపోయిన రెండు రోజులూ సెలవులు పెట్టేసి పర్మిషన్లు తీసుకుని ఈ సాయంకాలమే వెళ్లిపోయారు. ఈ పదహారు మందిలో ముగ్గురు స్థానికులే. అయినా అయిదు రోజులు కలిసొచ్చిన అవకాశం హక్కుగా భావించుకుని వాళ్లు కూడా క్లాసులకి "రాం, రాం," అన్నారు.

"సోంవారం నాటికి అందరూ వచ్చేస్తారని నమ్ముతాను. కాని, మన క్లాసెస్ ముగియడానికి అప్పటికింక పది రోజులే మిగుల్తాయి, చివరి రెండు రోజులూ టెస్టుకి పోతాయి. అంటే, ఇంక పని చేసేది ఎనిమిది రోజులే. ఆ ఎనిమిది రోజులూ రోజుకి పది గంటల చొప్పున పని చెయ్యవలసి రావచ్చు." అన్నారు కార్నీలియస్ గారు.

"టెస్ట్ అంటే నామకార్థమే అని: మీరు పనిగట్టుకుని ఎవర్నీ ఫెయిల్ చెయ్యరనీ అందరం నమ్ముకుని ఉన్నాం, సార్!"

"అదేం కుదిరే పని గాదు. ఫైనల్ టెస్ట్ జరపడానికి సెక్రెటేరియట్ నుంచి పురుషోత్తం గారు వస్తారు. ఆయన మహా కర్కోటకుడు. నేను మీ కెవ్వరికీ సాయం చెయ్యలేకపోవడం అటుంచి మీకు సరిగ్గా ట్రెయినింగ్ ఇవ్వలేకపోయానని మాట వడిపోతానేమో కూడాను."

ఎందు కయినా మంచిదని నేను మాట్లాడ లేదు. పెరుగు పలచగాఉంది, విస్తట్లోంచి టేబిలు మీదికి జారిపోతుందనీ: దాన్ని ఆపే పని ముఖ్యమనీ సూచించినట్టుగా జుర్రుతున్నాను.

నా భోజనం పూర్తయ్యే దాకా ఆయన కూడా ఇంకేం మాట్లాడ లేదు.

"ఈ పక్కనే సార్: మేం తీసుకున్న రూం...." అన్నాను యివతలికి రాగానే.

"నాకు తెలుసు. అందుకేగా, మీరు ఈ మెస్‌లో భోంచేస్తుంట!"

"మరి మీ కెందుకు సార్, ఈ ఖర్మ!" అన్లేదు నేను. 'చవక' అని ఇక్కడికి చేరిన సంగతి తెలుస్తూనే ఉంది. మా కందరికీ రోజుకి యాభై రూపాయలు ఎలవెన్సు. ఆయనికి నూట పాతిక.

"వన్ మినిట్, సార్! ఈ బ్యాగ్ లోపల పడేసి నేను తమరితో గెస్ట్ హౌస్ దాకా కంపెనీ ఇస్తాను."

"టే కిట్ ఈజీ! నాకు ఎస్కార్ట్ అవసరం లేదు."

"నో సర్! ఆగండి." తలుపు తాళం తెరిచి, అలవాటై పోయిన స్విచ్ వేసి, బాగ్ లోపల పడేసి: తిరిగొస్తున్నప్పుడు ద్వారం దగ్గిర పడున్న రెండు ఇన్లాండుకవర్లనీ ఏరుకుని జేబులో పెట్టుకుని: స్విచ్ ఆఫ్ చేసి, తలుపుకి తాళం పెట్టి అక్షరాలా ఒక్క నిమిషంలో ఆయన్ని చేరాను- 'ఎస్, సార్!' అంటూ.

గెస్ట్ హౌస్‌లో కార్నీలియస్ గారు బట్టలు మార్చుకుని మంచం మీద సెటిలయ్యే దాకా అక్కడున్న ఇంగ్లీషు డెయిలీ పేపరు చూస్తూ నించున్నాను.

"అరె; కూర్చోవేమయ్యా?" అని ఆయన లేచి నా జెబ్బ పట్టుకుని లాక్కెళ్లి కుర్చీలో కూలదోసిన హడావిడిలో నా జేబులో ఉన్న ఉత్తరాలు కిందపడ్డాయి.

మా అబ్బాయి రాసిన ఉత్తరాన్ని చిరునవ్వుతో చదివేశాను. రెండోది చదువుతుండగా నా మొహంలో ఆందోళన లాంటిది కార్నీలియస్ గారికి కనబడి నట్టుంది: "వాట్ హేపెండ్, మిస్టర్ సోమయాజులు?" అన్నాడు.

"మీ రిందాక మెస్‌లో అడిగారు కదండీ సార్- 'ఉగాదికి ఊరెళ్లక్కర్లేదా' అని... మీ మాటే ఖాయం అయింది సార్. నేను వెళ్లి తీరాలి. మీరేమీ అనుకోకపోతే నాకో తెల్ల కాగితం ఇప్పించండి సార్. రూమ్ కెళ్లి శలవు కాయితం రాసి తెచ్చి ఇచ్చేంత టైమ్ లేనట్టుంది-"

"ష్యూర్!"

"...నా ఆప్త బంధువు ఒకరికి ప్రాణం మీదికి వచ్చినంత జబ్బు చేసినట్టు ఉత్తరం వచ్చినందువల్ల నేను వెంటనే హైదరాబాదు వెళ్ళవలసి వస్తున్నది. కనుక, మార్చి నెల 26,27 తేదీలకు క్యాజువల్ లీవున్నూ సెలవు దినాలయిన 24,25,28 తేదీలకు పర్మిషనున్నూ గ్రాంటు చేస్తూ: రిఫ్రెషర్ కోర్సు కాలంలో స్థలం వదిలి వెళ్లరాదన్న నిబంధనను సడలించవలసిందిగా ప్రార్థించడమైనది..."

సంతకం పెట్టి కార్నీలియస్ గారికి అందించి వెళ్లిపోవడానికి తొందరపడ్డాను. ఆయన "ఒక్క నిమిషం!" అన్నాడు. మంచం మీది నుంచి లేచి వంకెన ఉన్న చొక్కా జేబులోంచి ఆకుపచ్చ సిరా కలం తీసి, నాఅప్లికేషను మీద ఏదో వ్రాయ సాగాడు. "గ్రాంటెడ్" అని ఒక్క మాట కాదది. ఖరాగా రెండున్నర లైన్లు వ్రాసి నాకిచ్చాడు.

"ఎట్టి పరిస్థితులలోనూ సెలవు పొడిగించరాదు, అట్లా పొడిగిస్తే స్పెషల్‌ట్రెయినింగ్ యావత్తు రద్దయిపోతుందని గ్రహించవలెను." అని, ఆ రాత.

"గుర్తించుకోవడమైనది." అని రాసి సంతకం చేసి ఇచ్చాను. కొర్నీలియస్ గారు గెస్ట్ హౌస్ బైటి వరండా వరకు నాకూడా వస్తూ; "అలా రాశానని ఏం అనుకోకండి. నా బాధ్యత నాకుంటుంది గదా!" అన్నాడు.

✣ ✣ ✣

మా అబ్బాయి రాసిన ఉత్తరంలో కూడా ఉగాదికి ఇంటికి రమ్మనే ఉంది. అయితే దానికి నేను అట్టే స్పందించలేదు.

"తనూ, బావ గారూ ఉగాదికి వస్తున్నాం అంటూ అక్క నాగపూర్ నుంచి ఉత్తరం రాసింది. సమయానికి మీకు ఈ స్పెషల్ ట్రెయినింగ్ ఒకటి దాపురించి మీరు పండగ పూటా అక్కడ ఉండి పోతున్నారే అని అమ్మ బాధపడుతోంది, ఏ మాత్రం వీలున్నా రమ్మని రాయమంది."

రెండో ఉత్తరం నాసహాధ్యాయి శంకరం రాశాడు :

"పాపం, లక్ష్మయ్య గారికి మొన్న సాయంకాలం గుండె పోటు వచ్చి నిమ్స్ (ఆస్పత్రి)లో చేరారు. నిన్న సాయం కాలం నేనూ, కృష్ణారావూ, నరసయ్యా వెళ్లి చూశాం. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్నారు. స్పృహలో లేరు. మేడమ్ అక్కడే ఉన్నారు. నిన్న మధ్యాహ్నం ఓ పదినిమిషాల పాటు కళ్లు తెరిచి ఉన్నారట. సోమయాజులు రాలేదా అని అడిగారట. నువ్వు ఓ సారి వచ్చి చూస్తే మంచిదని అనిపిస్తోంది.

"వాళ్లబ్బాయి కోసం నాగపూర్‌కి ఫోన్ చేసేరట. ఏప్రిల్ నెలాఖరికి అతను ఇచ్చెయ్యవలసిన పరిశోధనా వ్యాసం కోసం కొన్ని వివరాలు సేకరించుకోవాలని అతనూ, తన క్లాస్‌మేట్స్ ఇంకో ఇద్దరూ ఏదో ట్రైబల్ ఏరియాకి కాంప్ వెళ్లారని వాళ్ల గైడ్ చెప్పారట. నువ్వు ఓసారి వచ్చి కనిపిస్తే సార్ కి ప్రాణం కొంచెం కుదుటపడుతుందని మేడమ్ అన్నారు.

"ఎలాగైనా ప్రతాప్‌రెడ్డిని పట్టుకుని హైదరాబాదు పంపమని కోరుతూ ఈ ఉదయం ఆ కాలేజి ప్రిన్సిపాల్ గారి పేరిట వివరంగా టెలిగ్రాం ఇచ్చేను.,

"నిన్న సాయంకాలం మీ ఇంటికి వెళ్లేను. నువ్వు ఉగాదికి రావడం లేదని మీ ఆవిడ విలవిల్లాడి పోతున్నారు; మీ అమ్మాయీ, అల్లుడూ ఇరవై మూడో తేదీకి వస్తున్నారుట. 24,25 రెండు పబ్లిక్ హాలిడేస్ వచ్చాయి. 28 ఆదివారం. 26,27 సెలవు పెడితే మొత్తం అయిదు రోజులు ఉండి వెళ్లొచ్చు: అయినా నువ్వు మరీను- రానూ పోనూ రెండు వందలు ఖర్చవుతాయనే చూసుకుంటున్నావు గాని-"

రెండు ఉత్తరాలూ 22వ తేదీని రాసి 22నే హైదరాబాదులో పోస్టుచేసినవి, 23కి గుంటూరు చేరడం ఆశ్చర్యమే.

శంకరం "మొన్న సాయంకాలం " - అని రాశాడు. అంటే 20వ తేది అన్న మాట, రేపటికి ఐదో రోజు అవుతుంది.....

నా ఆరాధ్యదైవం అని చెప్పు కోదగ్గ లక్ష్మయ్య గారికి ఇప్పుడు ఎలాఉందో? ఇంటెన్సివ్ కేర్ యూనిట్ నుంచి ఇంటికి తీసుకొచ్చేరే, లేదో?

కొడుక్కీ ఆయనకీ పడడం లేదు. హాస్టల్లో ఉండీ కూడా కాంప్ వెళ్లిపోయాడని చెప్పించేశాడో ఏమిటో?

లక్ష్మయ్య గారికి తను చేసింది తప్పు అని అనిపించదు. అది ఆయన ఆత్మవిశ్వాసానికి సంబంధించిన సంగతే గాని: దాంట్లో ఏదో అప్రాపంచికమైన వ్యతిరేక భావం ఉన్నట్టు తోస్తుంది.

"ఆయన స్కూల్ రికార్డులోనూ, సర్వీస్ రికార్డ్లోనూ ఆయన కులం- మాదిగ-అని ఉంది, మా అమ్మ గారు రెడ్డి ఫామిలీ నుంచి వచ్చారు. కొడుకు కులం ఫలానా అని చెప్పవలసి వస్తే తండ్రి కులం చెప్తారా, తల్లిదా-మీరే చెప్పండి!నా కేస్ట్ "రెడ్డి"అని రాయించేసి నా భవిష్యత్తు మీద చావు దెబ్బ కొట్టేశారు, నాన్నగారు" అంటాడు, ప్రతాప్‌రెడ్డి.

"ఇప్పు డయినా మీరు దాన్ని మార్చొచ్చు సార్. హైకోర్టు తీర్పు ఉంది తల్లీ తండ్రీ చేసుకున్నది ఇంటర్ కేస్ట్ మేరేజి అయిన సందర్భంలో సంతానానికి తండ్రి కులమే ఖరా రవుతుంది" అని నేను లక్ష్మయ్య గారితో అన్నాను.

"షెడ్యూల్డ్ కేస్ట్ ముద్ర వేయించుకుని తక్కువ కృషితో ఎక్కువ ఫలితాన్ని పొందాలని ప్రతాప్ ఏంబిషన్. నేను చదువుకోడానికి గాని, ఉద్యోగం సంపాదించుకోడానికి గాని నా రికార్డ్లో ఉన్న నా కులాన్ని వాడుకోలేదు. అవసరం అనిపించే పరిస్థితులు ఉన్న వాళ్లే కులాన్ని వాడుకోవాలని నా ఉద్దేశం. ప్రతాప్ పుట్టడమే డిప్యూటీ కలెక్టర్ కొడుకుగా పుట్టాడు. ఆ తరవాత కూడా అతని పరిస్థితులు మంచివిగానే ఉన్నాయి. అత నెప్పుడూ క్లాసు ఫస్టు, స్కూలు ఫస్ట్. డిగ్రీలో యూనివర్సిటీకి సెకండ్‌గా వచ్చాడు. అలాంటి తెలివి గల కుర్రాడు నా పలుకుబడి వల్లనో, నా కులం వల్లనో కాకుండా తనంతట తాను కృషి చేసి వృద్ధిలోకి రావడం మంచిది కదా, సోమయాజులూ?"

లక్ష్మయ్య గారి తల్లీ తండ్రీ రజాకార్ల అల్లర్లలో చచ్చిపోయారు. అప్పటికి తనకి ఏడేళ్లు.

గ్రామాలు వదిలి పారిపోయిన వందలాది జనంలో ఆ ఏడేళ్ల పిల్లాడు ఒకడు. జనగాంలో చెప్పులు కుట్టుకుని జీవిస్తున్న ఒక కుటుంబం అతన్ని చేరదీసి పెంచేరు. అక్షరాభ్యాసం ఎనిమిదో ఏట అయినా పద్దెనిమిదో ఏట మెట్రిక్, ఇరవైకి ఇంటర్మీడియట్: ఇరవై రెండుకి డిగ్రీ పూర్తి చేసి: ఇరవై మూడో ఏట డిప్యూటీ కలెక్టర్‌గా సరాసరి నియామకం పొందాడు.

"నేను ఒక కాంది శీకుడి నన్న భావం గాని, అనాధ బాలుడి నన్న భావం గాని నన్నెప్పుడూ బాధ పెట్టలేదు. అదంతా నన్నుపెంచి పెద్ద చేసిన ముత్తయ్యగారి చలవ. వ్యవస్థమీద ఉండే అసహ్యాన్ని ఆయన వ్యక్తపరచవలసివచ్చినా సరే, అందులో కూడా ఆయన వినయమే చూపించాడు: దౌర్జన్యాని కెన్నడూ పోలేదు. పల్లెటూళ్లలో కొట్టొచ్చినట్టు అవలంబించే అంటరానితనం పట్నంలో మర్యాద చాటుకి వెళ్లిపోయి అవ్యక్తంగా ఉండిపోతుందని ఆయన తెలుసుకుని నా కోసం ఆయన హైదరాబాదుకి మకాం మార్చారు. ఎవరిమీదా ఆధార పడకుండా బతికితే నాగరిక సంఘం మాల మాదిగల్ని అణిచివేసే ప్రయత్నం చెయ్యదని ఆయన గ్రహించి తనంతట తాను నిలదొక్కుకున్నాడు: నన్ను నిలబెట్టాడు."అంటూ లక్ష్మయ్య గారు నాకు వివరించాడు.

లక్ష్మయ్యగారితో నాపరిచయం ఇప్పటికి ఇరవైఏళ్ల కిందటిది. నేను ప్రొబేషనరీ డిప్యూటీ తహసీల్దార్‌గా చేరిన మరుసటి ఏడాది, నాప్రాథమిక శిక్షణ (ఒక ఏడాది కాలం) గడిచేక నన్ను గుంటూరు కలెక్ట రాఫీసులో భూ సంస్కరణల యూనిట్‌కి సెక్షన్ హెడ్‌గా కొత్తగా ఏర్పడిన పోస్టులో నియమించారు, నా సెక్షన్‌లో ఒక యు.డి.సి: ఇద్దరు ఎల్.డి.సి.లు: ఒక టైపిస్టు:ఇద్దరు ప్యూన్లు-అందరూ నాకన్నా వయసు చేత పెద్ద వాళ్లే.

నా సెక్షను కలెక్టరాఫీసు మెయిన్ బిల్డింగులో కాక, విడిగా కట్టించి ఉంచిన ఒక పొడుగాటి

రేకుల షెడ్‌లో ఏర్పాటు చేసేరు, అందులో జిల్లా శ్టాటిస్టికల్ ఆఫీసు, ఎగ్రికల్చరల్ వింగు, మైనర్ ఇరిగేషన్ సూపర్ వైజరు యూనిటు, సర్వే సెక్షను ; ఉండేవి.

నా వయస్సు అప్పుడు ఇరవై ఏడేళ్లు, పెళ్లయి రెండేళ్లు కావస్తూంది. నేను, నా భార్య, మా పాపాయి: అరండల్‌పేట ఆరోలైన్‌లో ఒక పాత ఇంట్లో ఒక చిన్న వాటా అద్దెకి తీసుకుని ఉండేవాళ్లం.

ఒక రోజు సాయంకాలం నేను ఆఫీసు చాలించుకుని ఇంటికి వెళ్లిపోడానికి సిద్ధం అవుతూ ఉండగా నాఆఫీసు ఉండే షెడ్డు భాగానికి ఎదురుగా ఒక కారు ఆగింది, కారు నడుపుకుంటూ వచ్చిన "పి.ఏ. టు ది కలెక్టర్" లక్ష్మయ్యగారు అందులోంచి దిగి, నాసెక్షన్ వైపు వచ్చారు.

"వాట్, మిస్టర్ సోమయాజులు! ఇంకా ఆఫీసులోనే ఉన్నారే?"అని పలకరించా రాయన: ద్వారం అవతల నిలబడి,

"లేదు, సార్! ఇంటికి వెళ్లిపోదామని టేబిలూ, షెల్ఫులూ తాళాలు వేసుకుంటున్నాను." అంటూ రూమ్ దాటి వరండాలోకి వచ్చాను.

రూమ్‌కి తాళంఎప్పుడు వేస్తానా అని ఆత్రుతగా కప్ప తాళం పుచ్చుకుని నుం చున్న ప్యూను పి.ఏ. గారు అటు చూడగానే వంగి, దండం పెట్టి: వెనక్కి తగ్గాడు.

లక్ష్మయ్య గారు తాళంబిగించ మన్నట్టు నాప్యూనుకి సంజ్ఞ చేసి: నా వైపు తిరిగారు, "రండి: నా కార్లో వెళదాం" అని: మొహమాటంగా నేను అనవలసిన మాట (ఎందుకు లెండి-) కి ఆస్కారం ఇవ్వకుండా కారు వరకు నడిచి వెళ్లారు, సెక్షన్ తాళం చెవి జేబులో పెట్టుకుని కప్ప ఓ సారి లాగి చూసేసరికి ఆయన కారులో డ్రయివింగ్ సీటులో కూర్చుని ఇవతలి వైపున్న డోర్ తెరిచారు.

నేను కూర్చోవలిసిన సీట్లో ఒక ఫైలు ఉంది.

ఆయన తన వై వున్న డోర్ సరిగ్గా పడిందో లేదో చూసుకుంటూ కారు స్టార్ట్ చేశారు. "ఓ!... ... ఆ ఫైల్ వెనక సీట్లో వెయ్యండి" అన్నారు.

ఫైలు వెనక సీట్లో వేసేటప్పుడు, దాని ఫ్లాప్ మీద-

"ఇన్‌క్వయిరీ ఆన్ ఎన్.కె.సోమయాజులు: ట్రెయినీ డిప్యూటీ తాసిల్దార్"

అని రాసి గుండు సూదితో గుచ్చి ఉన్న కాగితం చూశాను.

నా ఒళ్లు జల్లు మంది.

నేను నా వై పున్న డోర్ బిగించగానే కారు కదిలింది.

"మీకు ఎవరన్నా చెప్పేరో లేదో - జె.పి.ఎల్. గ్విన్ అని ఒక ఐ.సి.ఎస్. ఆఫీసర్ కొన్నాళ్ల క్రిందట ఇక్కడ కలెక్టర్‌గా ఉండే వాడు:ఆయన సరిగ్గా ఐదింటికి లేచి బంగ్లాకి వెళ్లిపోయేవాడు, ఐదున్నర దాటాక నడుచుకుంటూ మళ్లీ వచ్చే వాడట.(బంగ్లా చాలా దగ్గిర: మీకు తెలుసుగా!) వచ్చిన వాడు తిన్నగా మేడ మీదికి వెళ్లి, హుజూర్ సెక్షన్స్‌లో ఎవరయినా ఉంటే: ముఖ్యంగా వరండాలో ఎవరయినా ఉద్యోగస్తులు కాని వాళ్లుంటే- పెద్ద గొడవ పెట్టేసే వాడట, అంటే, లాబీయింగ్ సాయంకాలం ఐదు దాటాక ముమ్మరంగా సాగుతుందని ఆయన థియరీ-"

"నేను సాధారణంగా అయి దింటికే ఇంటికి బయల్దేరేస్తాను, సార్!"

కారు కాంపౌండుగోడ దాట గానే ఆయన: "మీరు డైరెక్ట్ రిక్రూట్ కదు?" అన్నారు.

"ఎస్, సార్."

"మీ స్వస్థలం ఏది?"

"విజయనగరం, సార్."

"నేను కూడా డైరెక్ట్ రిక్రూట్‌నే- గ్రూప్- వన్ సర్వీసెస్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా రిక్రూట్ చేశారు. ఏ డేళ్లయింది. మాది తెలంగాణా.అసలు నల్లగొండ జిల్లా దేవరకొండ దగ్గర చిన్నవల్లెటూరు. అయితే, నేను జనగాంలో పెరిగాను. అ తరవాత హైదరాబాదు."

నా ఆలోచనంతా వెనక సీట్లో పడేసిన ఫైలు మీద ఉంది. ఆ ఫైలులో నా మీద 'ఇన్‌క్వైయిరీ' గురించి ఏవో కాగితా లున్నాయి. "ఎన్‌క్వైయిరీ" (భోగట్టా చేయడం) కాదు... "ఇన్‌క్వైయిరీ!" (-నేరం-?).... విచారణ జరపడం కావచ్చని స్ఫురించే సరికి నేను పశ్చాత్తాప అవస్థదాటి శిక్షకి సిద్ధం కావలసిన స్థితి వచ్చేసినట్టు స్పష్టమైపోయింది.

"డైరెక్ట్ రిక్రూట్స్‌కి అన్నీ ఛాలెంజెసే వస్తాయి! నీకు ఎన్నడూ అనుభవం పరిచయం లేని రంగాలలో నిన్ను ఒకానొక బాధ్యత గల స్థానంలో పని చెయ్య మంటారు. నీలో ఆత్మవిశ్వాసంతో బాటు గర్వం, అహంభావం పెరిగే విదంగా పరిస్థితులు వస్తాయి. అయినా సరే: ఉన్న తెలివి, చురుకుతనం పూర్తిగా ఉపయోగించుకుంటే తప్పు నెట్టుకు రాలేవు. అది అలా ఉండగా, నీతో పని చేసే వాళ్లలో ఎక్కువ మంది నీ కన్నా ముందుగా సర్వీసులో చేరిన వాళ్లుంటారు. వాళ్లకి ప్రమోషన్ ద్వారా రావల్సిన ఉద్యోగం నీకు ఆకాశం మీంచి ఊడి పడిందని అసూయ పడతారు, ఈ బొట్టికాయ గాడు ఎక్కణ్ణించో మన పీకల మీదికి తయార్తె పోయి అధికారం చెలాయిస్తున్నాడే అని చిరాకు పడతారు."

లక్ష్మయ్య గారు రోడ్డు మీద ఏకాగ్రమైన దృష్టి పెట్టుకుని కారు నడుపు తున్నారు. కాని, యాధాలాపంగా అంటు న్నట్టున్న ఆమాటలు కూడా ఆచి, తూచి: ఇంకా శ్రద్ధగా అంటున్నారు.

అందులో ప్రశ్న లేవీ లేవు, అం చేత నేను మాట్లాడక్కర్లే దన్నట్టుగా ఊరుకోవచ్చు. కాని, మీ రాడే మాటలు నేను శ్రద్ధగా వింటున్నాను సుమండీ- అని సూచించడానికి "ఎస్, సార్"- లు తప్పవు.

"ఇ దంతా ఇలా ఉండగా- ఇప్పుడు మీరు విజయనగరం ఏరియా నుంచి వచ్చేరు కదా, మీ బ్యాచ్‌లో ఈ ప్రాంతం వాడు ఒకడు కూడా ఇదే కేడర్‌లోకి సెలెక్ట్ అయ్యాడనుకోండి: అతనికి ఇక్కడ పని చెయ్యాలని ఉంటుంది. కాని, ఈపోస్ట్‌లో అతన్ని వెయ్యకుండా మిమ్మల్ని వేసేరు. ఇది అతనికి వేరే విధంగా అర్థ మవుతుంది, మీరే ఏదో మాయ చేసి గట్టిగా ప్రయత్నించి ఇక్కడికి పోస్టింగు తెచ్చుకున్నారని, తనకి రావలసింది మీరు కొట్టేశారని- అతగాడు బాధ పడతాడు. మిమ్మల్ని ఎలా గయినా ఇక్కణ్ణించి లేపేస్తే తను వచ్చి ఇక్కడ ఉద్యోగం చేసుకోవచ్చని ఆశ పడతాడు. సెలవు నాడో, సెలవు పెట్టో ఇక్కడికి వచ్చినప్పుడల్లా మిమ్మల్ని పలకరించినట్టే పలకరించి, మీ ఇష్ట మేమిటో కష్ట మేమిటో ఆరా తీస్తాడు. మీ శ్టాఫ్ దగ్గర ప్రాంతీయ అపేక్ష ప్రదర్శించి వాళ్లని మీరు గౌరవంగా చూడ్డం లే దనీ, హింసలు పెడుతున్నారనీ సూచించి సానుభూతి చూపిస్తాడు. మిమ్మల్ని కాక అతన్నే ఇక్కడ నియమించి ఉంటే తా మందర్నీ అతను ఎంతగా నెత్తిని పెట్టుకుంటాడో కదా అని వాళ్లు ఫీ లయ్యేటట్టు చేస్తాడు.ఈ ఉద్యమంలో మిమ్మల్ని ఇక్కడి నుంచి లే పెయ్యడానికి సహాయం చేసే వా డొకడు అతనికి దొరుకుతాడు. వాడికీ, మీకూ మధ్య మిత్ర భేదం పెడతాడు. (ప్రాంతీయ భేదం ఎలాగూ ఉండనే ఉంది కదా.) దానికి కేస్ట్ ఫీలింగ్ కలుపుతాడు. అవసరమైతే సబ్ కేస్ట్ ఫీలింగ్ దాకా వెళ్తాడు. బైదిబై, మీ పేరు సోమయాజులు కదూ?"

"ఎ స్సార్. కనకాద్రి సోమయాజులు."

"ఐ సీ... క న కా ద్రి - అంటే బంగారం కొండ?... నైస్, అంటే, మీరు బ్రామిన్సే కదూ?"

"సోమయాజులు అనే పేరు బ్రామిన్స్‌లోనే ఉంటుంది. సార్!'

"బ్రామిన్స్‌లో సబ్ కేస్టులు ఉంటాయి కాబోలు?"

"అవును సార్! నియోగులు,వైదికులు, తెలగాణ్యులు, వైష్ణవులు, మధ్వులు, గోల్కొండ వ్యాపార్లు - ఇలా చాలా ఉన్నా యండి. నియోగుల్లో మళ్లా ఆరువేలు, ప్రథమ శాఖ - ఉంటాయండి. వైదికుల్లో వెలనాటి, ద్రావిడ, వేగినాటి, కాసల్నాటి - ఇలా ఉప శాఖ లుంటాయండి. నాకు పూర్తిగా తెలియవండి, అస లెవరికో గాని పూర్తిగాతెలియ దండి. ఈ ఉప శాఖల మధ్య పెళ్లిళ్లూ పేరంటాలూ ఉండవు. అసలు భోజనభాజనాలే ఉండవండి, ఒక్కొక్కప్పుడు."

"ఐ సీ - షెడ్యూల్డ్ కులాలల్లో కూడా ఇలాగే ఉప శాఖ లున్నాయి ఫర్ ఎగ్జాంపుల్: మాల, మాదిగ, బారిక, రెల్లి - అందరూ పంచములే. మన వ్యవస్థలో అంటరాని వారుగా పేర్కొన్న వారే!... ... మీకు తెలుసో,లేదో - నేను మాదిగ - అనే కులం నుంచి వచ్చాను!"

ఆయన "ఫ్రాంక్‌నెస్"కి ఆశ్చర్య పడినా, అనవలసిన మాట వేరే ఉంది: "రాజ్యాంగం ప్రకారం అందరం ఒకటే నండి. నాగరికత పెరుగుతున్న కొద్దీ ఈ విభేదాలు పట్టించుకోడం మానాలి కదండి?"

"మీరు అలాగే అనుకోవచ్చు. కాని, జన సంస్కృతిలో ఈ విభేదాలు అంతర్వాహినిగా అలా కొనసాగుతూనే ఉంటా యనుకుంటాను. మీతో బాటు ఇదే కేడర్‌లో రిక్రూటయిన ఏసుపాదం మాల:కన్వర్టెడ్ క్రిస్టియన్. మీ సెక్షన్‌లో పనిచేస్తున్న హనుమంతరావు నియోగి బ్రామిన్ అట, వీ ళ్లిద్దరిదీ ఇక్కడికి దగ్గిరగా ఉన్న గోరంట్ల అనే వూరు, వా ళ్లిద్దరూ ఈవూళ్లో అయితే కలిసి తిరగడం, కాఫీలు తాగడం, సినిమాల కెళ్లడం జరుగుతుందేమో గాని గోరంట్లలో అలా కుదరదు గదా. బై ది బై: ఇక్కడ బ్రామిన్స్‌లో కూడా నియోగులకీ వైదికులకీ మధ్య ద్వేషం రేంపేంట్‌గా ఉందని అంటారు: మీకు తెలుసా?"

"ఏమోండి, నేను గమనించలేదు సార్."

"అయామ్ టోల్డ్ సో... దీంట్లో మోడెస్ట్‌గా ఉండడానికి కారణం ఏమీ లేదు, ఇది బహుశా అన్నికులాల్లోనూ ఉన్నదే! మన చాతుర్వర్ణ్య వ్యవస్థలో క్షత్రియుల సంగతి తీసుకుంటే తూర్పు రాజులు, పడమటి రాజులూ, రాయలసీమ రాజులూ - ఎవరికి వారే తమరే గొప్ప అనుకుంటారట. అట్లాగే వైశ్యుల్లో ప్రాంతీయంగా ఊహించుకునే తేడాలు కాక కళింగ కోమట్లు,త్రైవర్ణికులూ అనే భేదా లున్నాయట. శూద్రుల్లో అయితే చెప్పనలవి గాదు. కమ్మ,రెడ్డి, కాపు, తెలగ, బలిజ, వెలమ, శిష్టకరణాలు: లాంటి శాఖలు అలా ఉండగా కృష్ణా, గుంటూరు జిల్లాల కమ్మ వారికి గోదావరి జిల్లాల కమ్మ వారు తీసికట్టనీ: రాయలసీమ - తెలంగాణా రెడ్లు ఒకప్పటి సామ్రాజ్య అధినేతల వారసులైతే కోస్తాలో వారు అట్లా కా దని : ఎన్నెన్ని భేద భావాలో"

ఆయన మాటల్లాగే కారు కూడా ఎక్కడెక్కడికో వెళ్లిపోతున్నట్టుంది. మునిసిపల్ ఆఫీసు దాటి, జిన్నా టవర్ దాటి, పాత బస్‌స్టాండ్ దగ్గిరి కొచ్చాం.

"సార్! తమరిల్లు హరిహర మహల్ దగ్గిరని అన్నారండి. ఇటువైపు మారారా?"

కారు ఆగింది. లక్ష్మయ్య గారు హారన్ మోగించారు.

ఎడం వేపు ఉన్న "ఎలెక్ట్రికల్ - రీ - వైండింగ్ షాపు" లోంచి ఒక సన్నపాటి అబ్బాయి వచ్చాడు. లక్ష్మయ్య గారి వైపు పరుగెత్తుకెళ్లి "నమస్కారం సార్! " అన్నాడు.

"ఏక్ ఛోటాసా కామ్ హై, హుసేన్!" అన్నారు లక్ష్మయ్య గారు.

"జీ!"

ఈ సార్ అరండల్ పేట ఆరో లైన్‌లో ఎడ్వకేట్ విశ్వేశ్వరరావు గారింట్లో ఉంటారు. డిప్యూటీ తహసిల్దార్."

"నమస్తే సార్!"

'రేపు ఉదయం ఈ సార్ ఇంటికి వెళ్లాలి. ఎలెక్ట్రికల్ వర్క్ ఒకటుంది. ఏక్, దో - ఘంటే కా కామ్, జరూర్ కర్నా పడేగా; కల్ హీ!'

" జీ! "

"చుప్ చాప్‌సే కామ్ కరో, ఔర్ హమే మిలో, పైసే హమ్ దేతే."

"జీ, సాబ్."

లక్ష్మయ్య గారు కారు స్టార్ట్ చేశారు; మాటలు కూడా.

"సీ, మిస్టర్ సోమయాజులు; ఎవ్విరిబడీ మేక్స్ మిస్టేక్స్. కాని, ఎక్కువ మంది తెలియకే తప్పులు చేస్తారు... ... వెనక సీట్‌లో ఫైల్ ఉంది. చూశారుగా, పాతిక పేజీలుంది. ఈ రోజు శనివారం కదా; సోమవారం ఆ ఫైలు క్లోజ్ చెయ్యాలి... మీ మీద నాలుగు ఎలిగేషన్స్ ఉన్నాయి అందులో. అన్నీ కలెక్టర్ గారి పేరుమీద సీక్రెట్ అనీ, కాన్ఫిడెన్షిల్ అనీ వచ్చేయి. ఎలిగేషన్స్ అన్నానే గాని అవన్నీ నిజమే అని నా దృష్టికి వచ్చింది. మీది ఈ ప్రాంతం కాదు. మీకు ఇక్కడి లిటిగేషన్లూ మాయామర్మం తెలియవు. అధికార దుర్వినియోగం అనీ, ప్రభుత్వ ఆస్తుల చోరీ అనీ ఛార్జెస్ పెట్టి మిమ్మల్ని సస్పెన్షన్‌లో పెట్టించి మీ ఉద్యోగం ఊడగొట్టించాలని ఆ ఎలిగేషన్స్ పంపిన వాళ్ల కోరిక. కాని, అలా చెయ్యడం నా కిష్టంలేదు....

"మీ సెక్షన్‌లో అల్మేరాలకి పైగా ఉన్న సీలింగ్ ఫాన్ నిరర్థకంగా ఉండేది. మీరు అద్దెకున్న ఇంట్లో ఫాన్ లేదు. చంటిపిల్ల, గుంటూరు ఎండలు. ఫరవా లేదు సార్, ఇది పట్టుకుపోయి మీ ఇంట్లో ఫిక్స్ చేస్కోండి; ఎవరన్నా అడిగితే అప్పుడు అసలిక్కడ ఫానే లేకుండె, అని చెప్పేద్దాం అని మీకు యూడీసి హన్మంతరావ్ సలహా చెప్పాడు. రేపు హుసేన్ సాయం తీసుకుని ఆ ఫాన్ ఎక్కడుండేదో అక్కడ ఫిక్స్ చేయించేండి.

"రెండు ... మీరు కొత్త ప్రాజెక్టులో పనిచేస్తున్నారు కదా అని శాంక్షన్ చేసిన ఫర్నిచర్‌లో ఒక టేబిలు, ఒక కుర్చీ ఒక స్టూలు- మీ హాల్లో ఎడ్జస్ట్ కాకపోయేసరికి - 'ఇంటి దగ్గిర కూడా ఆఫీస్ వర్క్ చేస్తారు కదా; అక్కడ పెట్టించేస్తాను సార్ అని మీ ఫ్యూన్ రాములు రిక్షా ఎక్కించి మీ ఇంటికి చేర్చాడు. అవి అక్కడ అవసరం ఉన్నాయని; పట్టుకెళ్లడానికి పర్మిషన్ ఇమ్మనీ రెండు నెలల కిందటి తేదీతో నాకొక అప్లికేషన్ ఇవ్వండి.

"మూడు ...... మీకు తరుచు రిఫరెన్స్‌కి అవసరమైన ఇనామ్ ఫేర్ రిజిస్టర్స్‌ని రికార్డ్ సెక్షన్ నుంచి తెచ్చుకున్నారు. వాటి బైండింగు 1900లో చేసేరు. వదిలేస్తోందని నోట్ పెట్టి వెయ్యి రూపాయలు శాంక్షన్ చేయించుకోవచ్చుననీ, దాంట్లో నాలుగు వందలు మిగుల్చుకోవచ్చునని మీ

ఎల్.డి.సీ రామారావు మీకు ఆశ పెట్టేడు. పని పూర్తి చేయించి రసీదులు ఇచ్చేశారు గనక ఇది మీరు దిద్దుకోలేరు. అయితే ఆ బైండర్‌ని సోమవారం నారూమ్‌కి పిలిపిస్తే అతను ఏమని స్టేట్‌మెంట్ ఇవ్వాలో అది నేనుచూసుకుంటాను.

"నాలుగు ... ... ఎలెక్ట్రిక్ బల్బులు, మంచి నీళ్ల గ్లాసులు, కప్ సాసర్లు అవసరమైన దానికి మించి కొని; వాటిలో కొన్ని మీ ఇంట్లో వాడుతున్నారు. రేపు సీలింగ్ ఫాన్‌తో బాటు అవి కూడా ఆఫీసుకి చేరుతాయి; 'ఉత్తరోత్రా వాడుకుందికి' - అని స్టాక్ బుక్‌లో నిల్వ చూపించండి... ..."

కారు మా ఇంటి దగ్గిర ఆగింది. "దిగండి" అన్నారు లక్ష్మయ్య గారు. నేను ఇటువైపు దిగుతున్నంతలో ఆయన అటువైపు నుంచి దిగి మా ఇంటి మెట్ల దగ్గిరి కొచ్చారు. నాకు కళ్లమ్మట నీళ్లు. గొంతులో గురగుర... చూడలేక, మాట్లాడలేక.

"సో-" అన్నారు లక్ష్మయ్య గారు నా భుజం మీద తట్టి. "ఆకర్షణ అంటే అందం, దాన్ని అనుసరించి గొయ్యి ఉండొచ్చుననే ప్రపంచ జ్ఞానం కూడా ఉంచుకోండి. అత్యవసరం అయితే తప్ప తప్పు పన్లు చెయ్యకండి... మరి నేను వెళ్లొస్తాను... ..."

నడి వీధి, ఇంకా చీకటి పడలేదు. అయినా సరే, లక్ష్మయ్య గారి కాళ్లకి నమస్కారం చెయ్యడానికి వంగాను.

అయితే ఆయన నన్ను నడుంకి మించి వంగ నివ్వలేదు.

✣ ✣ ✣

సికింద్రాబాదు రైల్వే స్టేషన్‌లో దిగి, అశోక్‌నగర్‌లో ఉన్న శంకరం ఇంటికి వెళ్లాను.

"గండం గడిచినట్టే.. నిన్న సాయంకాలం ఇంటెన్సివ్ కేర్ యూనిట్ నుంచి రూమ్‌కి మార్చారు. నువ్వు వచ్చే వంటే చాలా సంతోష పడతారు." అన్నాడు శంకరం. వాచీ చూసుకున్నాడు. "ఎనిమిదిన్నర దాటితే సాయంకాలం వరకు లోపలి కెళ్లనివ్వరు. అందులోనూ ఇవాళ సెలవు కదా. సాయంకాలం పూట అయితే పేషెంట్లని చూడడానికి ఎవడు పడితే వాడే తయారయి పోతాడు. గేటు దగ్గిర క్యూ ఉంటుంది." అన్నాడు.

"నేను ఇప్పుడే వెళ్లి ఆయన్ని ఓ సారి చూస్తాను. రాత్రి ఎనిమిదిన్నరకి నీ ఉత్తరం చదువుకున్నాను. అప్పట్నించీ ఎప్పుడెప్పుడా అనుకుంటూ ఇలా వచ్చేను. ఈ సూట్‌కేసు మాఇంటికి చేరే ఏర్పాటు చెయ్యి. నేను ఇంటికి నింపాదిగా వస్తాను. వీలయితే నువ్వు కూడా నిమ్స్‌కి రా" అన్నాను.

"నువ్వెళ్లులే" అని లేచాడు శంకరం "ఇంకా గంటన్నర టైముంది. స్నానం చేసి కాఫీ పుచ్చుకుని బయల్దేరుదాం. ఆటోలో పోదాం. నిన్ను అక్కడ దించేసి నేను మీ ఇంటికి వెళ్తాను. మీ అల్లుడు వొచ్చుంటాడు కదా. అతనితో నాకు చిన్న పనుంది. నువ్వొచ్చే దాకా మీ ఇంట్లో కూర్చుంటాను!"

"అంతకంటేనా?" అని కాలకృత్యాల్లో పడ్డాను.

"రాక రాక హార్ట్ ఎటాక్ లక్ష్మయ్య గారికే వచ్చింది. చూడు! ఆయన సిగరెట్ కాదు గదా, కనీసం విస్కీ అయినా తాగడు! కొండల్రావు గారు, అ మ్జాద్ గారు, అచ్యుత రావు గారు, కొర్నీలియస్ గార్లాంటి సకల గుణాభిరాము లందరూ ఎంచక్కా ఉన్నారు. అన్నట్టు మీ రిఫ్రెషర్ కోర్స్ ఆఫీసర్ కొర్నీలియస్ గారే కదూ? - ఏం టంటాడు, గురుడు? - ఏదైనా పిక్నిక్ లాంటిది పెట్టి మిమ్మల్నందర్నీ

ఫిరంగిపురం తీసికెళ్లేడా, లేదా?" అంటూ శంకరం తన ధోరణిలో మాట్లాడుతూ ఉంటే రాత్రంతా నన్ను హింస పెట్టిన నైట్‌మేర్స్, దుస్వప్నాలు- అన్నీ చెదిరిపోయి హాయిని పడింది ప్రాణం.

✣ ✣ ✣

"సో - మిస్టర్ "సో" హాజ్ కమ్ టు సీ మి - ఎట్‌లాస్ట్!" అని లక్ష్మయ్య గారు నిండుగా నవ్వుతూ పలకరిస్తే గండం గడిచింది నాకే నన్నంత ఆనందం.

"మిమ్మల్ని చూసి నెల రోజులై పోయింది. సార్... నిన్న రాత్రి అందింది, శంకరం రాసిన లెటరు. నర్సపూర్ ఎక్స్‌ప్రెస్ పట్టుకుని వచ్చేశాను. క్రైసిస్ టైమ్‌లో ఏదయినా హెల్ప్‌చెయ్యడానికి ఇక్కడ లేకపోయానే అని విచారంగా ఉన్నా మిమ్మల్ని ఇలా కులాసా మూడ్‌లో చూసినందుకు చాలా సంతోషంగా ఉంది."

"మీకు ఉత్తరం రాసినట్టు శంకరం గారు చెప్పేరు, నిన్న. అయితే, మీరింత శ్రమపడి రాకపోయినా పెద్ద తేడా ఉండేది కాదు".

నా ఇరవై రెండేళ్ల సర్వీసులో కొన్ని డజన్ల మంది ఆఫీసర్ల కింద పనిచేశాను, సార్! మీరు నా కెరియర్ మీద, నా మనస్సు మీద - వేసిన అపేక్షా ముద్ర లాంటిది ఇంకెవ్వరూ వెయ్యలేదు, సార్. ఐ విష్ యు వుడ్ లివ్ ఎ ఫుల్ హండ్రెడ్ ఇయర్స్, సార్!"

"థాంక్యూ. బైది బై; ఏమిటి, మీరు ఎటెండవుతున్న ఆ రిఫ్రెషర్ కోర్సు?... .. నేను ఫైనాన్స్‌కి మారిపోయాక టచ్ పోయింది... ..."

"ఏముంది, సార్! మళ్లీ మరో ఆరు చట్టాల మీద డిటేల్డ్ ఎగ్జామ్ ఉంది. దీంట్లో గెటాన్ అయితే తప్పా ఎస్.ఓ. స్ లిస్ట్‌లోకి ఎక్కను."

"ఐ.సీ. ఎవరు కండక్ట్ చేస్తున్నారు, క్లాసెస్?"

"కార్నీలియస్ గారని - లాండ్ రిఫామ్స్ కమిషనరేట్‌లో-"

"ఎస్, ఎస్; నాకు తెలుసు!" విరిచి విరిచి నవ్వారు లక్ష్మయ్య గారు. "నేర్చుకోడానికి వోపిక లేని వాళ్లు ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడతారని కాబోలు, సామెత... ఎలా ఉన్నాడు?"

"ఈ ఇరవై ఏడు రోజుల్లో ఆయన క్లాస్‌లో తప్ప వేరే ఎక్కడైనా మాట్లాడితే అది నిన్న రాత్రే; అదీ నా తోనే సార్! అందరూ ఉగాది అని పర్మిషన్లూ, లీవులూ పెట్టి ఇళ్లకి వెళ్లిపోయారు. నేను భోం చేస్తున్న మెస్‌లోనే ఆయన కూడా భోంచేస్తున్నారని - అదీ నిన్ననే తెలిసింది. నాతో బాగానే మాట్లాడారు. సార్!"

"మీ కాయన ఇంతకు ముందు తెలుసా?"

"తెలుసా అంటే తెలుసుగా నండి; కలిసి ఎక్కడా పని చెయ్యలేదండి సార్. "

లక్ష్మయ్య గారు తలగడలు ఎత్తుగా పేర్చుకుని మరింత సౌఖ్యంగా కూర్చున్నారు. "సో, మీరు లీవ్ పెట్టే వచ్చారు కదా?"

"ఎస్, సార్, లీవ్ పొడిగిస్తే ట్రెయినింగ్ మొత్తం కాన్సిలయిపోతుందని రాసి నోట్ చేయించుకున్నారండి, సార్!"

"దటీజ్ కార్నీలియస్!" అని ఒక వేలుగాల్లో ఆడించారు లక్ష్మయ్యగారు. "ఆయన ఆ మాటమీద నిలబడతాడనడానికి ఎలాంటి సందేహం వుండదు!... ... మీకు చిన్న వార్నింగ్ ఇస్తున్నాను. మీరు

సెలవు పొడిగించకుండా వెళ్లిపోండి. అవకాశం ఉంటే ఒక పూట ముందుగానే వెళ్లి రిపోర్టు అయిపోండి. లేకపోతే అతను మిమ్మల్ని చిక్కుల్లో పెట్టేస్తాడు!"

"అంత రూలు మనిషా, సార్?"

'... ... అదో రకం!... అతనికి ఇబ్బంది లేని చోట రూలు పట్టుకుని వేళ్లాడగలడు. అపకారం చెయ్యడానికి ఎప్పుడూ సర్వసిద్ధంగా ఉండే స్వభావం... యు - నో? కేస్ట్ ఫీలింగ్ తీవ్రంగా ఉండే వాళ్లలో అతనొకడు. తన ఫోల్డ్‌లో ఉన్న వాళ్లలో ఎవరెవరు ఏ యే కులం వాళ్లు అని తెలుసుకుని మరీ సాగిస్తాడు, పరిపాలన. ఏ పోస్ట్‌లో జాయినైనా సరే, మొట్టమొదటగా చేసేది ఆ ఎన్క్వయిరీయే.'

"ఆయన క్రిస్టియన్ కదండి, సార్?" అన్నాను; "మనలో లాగా కులభేదం పాటించవలసిన అవసరం ఆయన కెందుకు?" అని అడక్కుండా.

ఉన్నట్టుండి లక్ష్మయ్య గారు పళ్లు పట పటా కొరికి భీకరంగా మారిపోయారు. "డర్టీ ఫెలో; వాడు క్రిస్టియనేమిటి! నిజమైన క్రిస్టియన్స్ సౌమ్యంగా దయగా ఉండడం ఎరుగుదును, నేను! లవ్ అండ్ గెట్ లవ్డ్ - అని గౌరవం ఇచ్చి పుచ్చుకుంటారు. వాడా క్రిస్టియన్? వాడు క్రిస్టియన్ అయితే అది ఆ మతానికే అవమానం! ఇంట్లో ఏసుక్రీస్తు పటాలు వేళ్లాడ గట్టి, ఆదివారం చర్చిలో సెర్మన్స్ వినటం వరకే, అది ! రికార్డ్సులో అతను హరిజన్... మేం ఇద్దరం ఒకే బ్యాచ్‌లో రిక్రూట్ అయ్యాం. నేను సూడో ఎస్ సీ అని కాయితం పెట్టి; రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఆ ఒక్క ఎస్ సీ రిజర్వేషన్ పోస్టూ నాకు ఇవ్వకూడదనీ తనకే ఇవ్వాలనీ పైరవీకి దిగాడు. మొత్తం ఈ ముప్ఫయి ఏళ్ల సర్వీసులో కనీసం అరవై మంది నాన్ ఎస్.సీ. లని పుణ్యాం కట్టుకున్నాడు. వాళ్లందరూ ఉద్యోగాలు పోగొట్టుకొని అడుక్కుతినడం లేదు గాని, ప్రమోషన్లు ఆగిపోయి, ఇంక్రిమెంట్స్ ఆగిపోయి, వీడి ఎదాన్ని పడి ఉసూరు మని ఏడుస్తూనే ఉన్నారు. తన వ్యసనాలని తీర్చిన వాళ్లనయినా వదిలి పెట్టాడా అంటే అదీ లేదు... తమ్ముడు తమ్ముడే, పేకాట పేకాటే!" అని ఆవేశంగా చెప్పేసి కళ్లు మూసుకుని తలగడాలకి చేరబడి పోయారు లక్ష్మయ్య గారు.

ఆయన గొంతు పెంచి మాట్లాడడం విన్నట్టుంది; మేడమ్ సావిత్రి కారిడార్‌లోంచి పరుగెత్తు కొచ్చారు. "సోమయాజులు గారూ!" అని నన్ను మెత్తగా మందలించారు. "బి.పి." అని రెండక్షరాలు ఎడంచేతిలో కుడిచేతి వేలితో రాసి చూపించేరు.

నేను నమస్కారం చేశాను. "సారీ, మేడమ్! నేనేం ప్రొవోక్ చెయ్యలేదు." అన్నాను, ఆవి డొక్కరికే వినిపించేటట్టు.

సావిత్రి గారు బెడ్ దగ్గిరికి వెళ్లి, లక్ష్మయ్య గారి చెవి మీదికి వంగి "సోమయాజులు వెళ్తా నంటున్నారు. రేపు రమ్మంటానేం-? అన్నారు. నాకు సంజ్ఞ చేసి, గదిలోంచి ఇవతలికి వచ్చారు.

"అబ్బాయి ఇంకా రాలేదని వారికి చిరాగ్గా ఉందండి... ... అలా అని చెప్పరండి... కాని, ఆ సంగతి గుర్తొచ్చే టయిమ్‌లో ఏం మాట్లాడినా ఇట్లాగేనండి... ..." అని కళ్లు తుడుచుకున్నారు.

✣ ✣ ✣

శనివారం మధ్యాహ్నం లక్ష్మయ్య గారికి మళ్లీ తిరగబెట్టింది. విజిటింగ్ టైమ్ సాయంకాలం నాలుగు నుంచి ఆరున్నర దాకా ఉంది కదా అని వెళ్తే ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్నారని తెలిసింది. ఆ లోపలికి వెళ్లడానికి నన్ను అనుమతించ లేదు. కొంత సేపు ఆ అద్దాల తలుపు దగ్గిర నిలబడి ఉండగా సావిత్రి గారు నే నొచ్చిన సంగతి గమనించి ఇవతలికి వచ్చేరు.

"అబ్బాయి రాలేదు." అన్నారు.

"మా అల్లుడు గార్ని నాగపూర్ పంపించి రెండు రోజులైంది మేడమ్! ప్రతాప్‌ని ఎలాగైనా పట్టుకుని వెంటనే ఇక్కడికి తీసుకొచ్చేమని చెప్పేను. మా అమ్మాయి ఇక్కడే ఉంది!" అన్నాను.

"ఆశ లేదు" అన్నారావిడ. "మీరు రేపు ఉదయం... వస్తారుగా..." ఆవిడకి ఏడు పొచ్చేసింది.

"మేడమ్, మేడమ్... ... కంట్రోల్ చేస్కోండి, మేడమ్, అంతా సవ్యంగా జరిగిపోతుంది..." అంటున్నాను.

పక్కనించి ఒక డాక్టరుగారు లోపలికి వెళ్తూ అక్కడ ఆగి; "నో సీన్స్; ప్లీజ్!" అన్నారు. ఆవిణ్ణి లోపలికి వెళ్లిపోమని సూచిస్తూ ఆ ఔటర్ డోర్ తెరిచి పట్టుకున్నాడు.

✣ ✣ ✣

ఆదివారం ఉదయం ఏడు గంటలకి నేను నిమ్స్‌కి బయలుదేరుతూ, అటు వెళ్లే బస్సు బయలుదేరడానికి ఇంకో అయిదు నిముషాలు టైముందని తెలిసి, బస్సు దిగి, పక్కనే ఉన్న బంక్‌లోకి వెళ్లి లక్ష్మయ్య గారింటికి ఫోన్ చేసేను. పనమ్మాయి పలికింది. "నేను, సోమయాజుల్ని, యాదమ్మా! ప్రతాప్ వచ్చేడా?"

"రాలే, సార్. నువ్ జల్దీ ఈడకొల్లిరా, సార్!" అంది.

"ఒస్తాలే. ముందు ఆస్పటల్ కెళ్లాలిగా."

"ఆస్పటల్ కెందుకు, సార్. గీడకె రా. నీకు దెల్వద; సార్ రాత్రి సనిపోయిండుగ! మేడమ్ బేహోషయితంది. ఎవురికి ఫోన్లు జెయ్యాల. అంతా నీకెర్క గంద-"

✣ ✣ ✣

సోమవారం ఉదయం పది గంటలకి; శంకరం నా సూట్ కేసు పుచ్చుకుని అంబర్‌పేట శ్మశాన వాటికకి వచ్చేడు. అప్పటికి లక్ష్మయ్యగారి "భౌతిక కాయం" ఇంకా సగంపైగా మిగిలుంది.

"సోములూ! చెయ్యవలిసిందంతా చేసేవు కదా! కొడుకు రాకపోయినా నువ్వే కొడుకు వన్నట్టుగా చితి అంటించావు... యు - రియల్లీ - గ్రేట్.. ... కాని, నీ సంగతి కూడా నువ్వు చూసుకోవాలి... ప్లీజ్!.. వెంటనే బయల్దేరు... టాక్సీ తెచ్చాను... ఎలా లే దన్నా ఆరుగంటల ప్రయాణం... ఒద్దు; ఎవరికీ చెప్పక్కర్లేదు; చెప్పకూడదు కూడాను... వెళ్లిపో... ఇప్పటికే ఆ కొర్నీలియస్ గాడు నీమీద ఆబ్సెంట్ రిపోర్ట్ తయారు చేసేసుంటాడేమో... ... .. నేను ఫోన్‌లో కాంటాక్ట్ చేసి నువ్వొచ్చేస్తున్నావని చెప్తాను... అసలు నువ్వొక పనిచెయ్యి... గుంటూరు చేరుతూనే సరాసరి కలెక్టర్ గార్ని కలుసుకో, సంగతంతా ఆయనికి అహ్మద్ గారితో చెప్పించి ఉంచుతాను...ప్లీజ్ ... వెనక్కి చూడకు... కావాలంటే నేనిక్కడ ఒక గంట ఉండగలన్లే... టాక్సీకి మూడు వందల యాభై ఇవ్వాలి... ఇది నీ దగ్గిరుంచు..."

✣ ✣ ✣

కలెక్టర్ ప్రీతమ్‌సింగ్ గారు నా తప్పిదాన్ని కప్పి పుచ్చమని కొర్నీలియస్ గారికి చెప్పినప్పుడు ఎలా చెప్పేరో గాని నాతోమాత్రం - "ఒక పద్ధతిలో" మాట్లాడారు. "కొంచెం ముందూ వెనకా చూసుకోవాలి, మిస్టర్! మీరు తప్పు చెయ్యడం; మా చేత తప్పు చేయించడం - ఇదంతా ఆఫ్ కోర్స్- పూర్తిగా సమర్థించ దగిందే గాని - ఓకే- వెళ్లు!"

కొర్నీలియస్ గారు నారాకను "సాయంకాలం" అని కాక "ఉదయం" అని రికార్డ్ చెయ్యడానికి చాలా చిరాకు పడీ కూడా; అభినందిస్తూనే (సంతోషిస్తూ కూడా) ఒప్పుకున్నారు.

" మీరు శనివారం ఉదయంనుంచీ కనపళ్లేదని అమ్మ చాలా బాధపడింది. ఆదివారం ఉదయం మీరు శ్మశాన వాటికకి వెళ్లేరంటే నొచ్చుకుంది. అక్కడ మీరు చేసిన పని ఏమిటో తెలిసేక పూర్తిగా అప్‌సెట్ అయింది. ఏమైనా సరే మేం ఎవరూ కూడా మీకు చెప్పతగిన వాళ్లం కాదు." అంటూ మా అబ్బాయి రాసిన ఉత్తరం మా ట్రెయినింగ్ చివరి రోజున చేరింది.

ప్రతాపరెడ్డి కులం మార్పు, అతని థీసిస్ ఆమోదం పొందినట్టు ఆర్డరు - ఒక్క రోజునే. అతను ప్రభుత్వ సర్వీసులో ఏదైనా మంచి పోస్టులో సరాసరి నియామకం పొందడానికి రెండు విధాలుగా (కాదు, మూడు విధాలుగా) అర్హుడయ్యాడు.

నేను చేసింది అపభ్రంశపు పని అని మా కుటుంబ సభ్యులూ బంధువులూ నమ్మినా,నన్ను ఆదరాభిమానాలతో చూస్తూనే ఉన్నారు.

లక్ష్మయ్యగారికి ఇష్టం లేకపోయినా ఈ వ్యవస్థ ఇలా కొనసాగుతూనే ఉంది. "చాతుర్వర్ణ్యం మయా సృష్టం" అని భగవానువాచ. చతుశ్శతకులం రాజకీయ సృష్టి అవుతుందని అప్పట్లో ఆయన కూడా ఊహించలేకపోయాడు.

☼

*("ఆంధ్రప్రభ" వీక్లీ: 27-10-93)*

*with the best compliments from :*

**DINAKARA OIL COMPANY**

***DEALERS***

**INDIAN OIL CORPORATION LIMITED**

**TANUKU**